www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 1 జనవరి 2025 5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ





విరిసిన ఉత్సాహం
కడియం పల్ల వెంకన్న నర్సరీలో న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన మొక్కల అమరిక

నేతన్న నేస్తం అందేదెన్నడో?

- ఎదురు చూస్తున్న కార్మికులు
- 'చేనేత'కు కొరవడిన సర్కారు సహకారం
- అమలుకు నోచుకోని హామీలు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మగ్గాలను నమ్ముకుని జీవిస్తున్న వారికి గత వైసిపి పభుత్వం 'నేతన్న నేస్తం' పేరుతో ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సాయం అందించింది. నేతన్న నేస్తం ఆర్థిక సాయం ముడి సరుకు, ఇతర అవసరాలకు ఉపయోగించుకునేవిధంగా అండగా నిలిచింది. అయితే 2023 జూలైలో ఆ ప్రభుత్వం చివరి సారిగా సాయం అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం అమలు చేస్తారో లేదో స్పష్టత లేకుండా పోయింది. 7 నెలలు గడుస్తున్నా నేతన్న నేస్తం అమలుపై సర్కారు నోరు మెదపడం లేదు. ప్రభుత్వం అందించే సాయం కోసం చేనేత కార్మికులు ఎదురుచూపులు చూస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని యు.కొత్తపల్లి మండలంలోని అమీనాబాద్, మూలపేట, గొల్లప్రోలు, ఇదే మండలంలోని తాటిపర్తి, చేబ్రోలు, ప్రత్తిపాడు మండలం ధర్మవరం, తుని, అమలాపురం, బండారులంక, దుళ్ల, కడియం మండలం వీరవరం, విలసవిల్లి, పుల్లేటికుర్రు, అంబాజీపేట, సఖినేటిపల్లి, ఉప్పలగుప్తం తదితర ప్రాంతాల్లో పలు కుటుంబాలు నేత పనిపై ఆధారపడి జీవిస్తున్నాయి. జిల్లాలో 50 సహకార సంఘాల్లో సుమారు 30 వేల మంది చేనేత కార్మికులుగా నేమోదయివున్నారు. మాస్టర్ వీవర్స్ వద్ద స్వయం ఉపాధి చేసుకుంటున్న వారు మరో 40 వేల మంది వరకూ ఉన్నారు. అధికారులు లెక్కల ప్రకారం వీటి పరిధిలో 15,700 మగ్గాలు ఉన్నాయి. ఇందులో సహకార రంగంలో 11,980, సహకారేతర రంగంలో 3,720 మగ్గాలున్నాయి.

ఎప్పుడిస్తారో.?

నష్టమైనా, కష్టమైనా చేనేతనే నమ్ముకుని అనేక మంది కార్మికులు కాస్తో కూస్తో కుటుంబాలను పోషించుకుంటున్నారు. గత వైసిపి ప్రభుత్వం నేతన్న నేస్తం పేరుతో ప్రతి ఏటా సాయం అందించడంతో ఆ కుటుంబాలన్నీ ఈ వృత్తిని కొనసాగించుకుంటూ జీవనం సాగించే పరిస్థితి ఏర్పడింది. 2023 జులైలో కోనసీమ జిల్లాలో 4,279 మందికి, కాకినాడ జిల్లాలో 2,778 మందికి, తూర్పుగోదావరి జిల్లాలో 916 మందికి నేతన్న నేస్తం చివరి సరిగా అందించారు. అయితే ఇంకా అనేక మందికి ఈ పథకం అందాల్సి ఉంది. ప్రభుత్వ విధానాల వలన చేనేత కార్మికుల బ్రతుకుల్లో మార్పులు రావడం లేదు. నేతన్న నేస్తం ద్వారా గుడ్డిలో మెల్లగా కాస్త ఉపయోగం ఉన్నప్పటికీ ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో కార్మికులకు ఉపాధి తగ్గుతూ వస్తుంది. ఉదాహరణకు పడుగు ధర రెండేళ్లలో పొల్చుకుంటే రెట్టింపు అయింది. కిలో పడుగు ధర రూ.5 వేల నుంచి రూ.8 వేలకు పెరిగింది. నేతకు ఉపయోగించే ముడి సరుకు ధరలు విపరీతంగా పెరగడంతో గణనీయంగా ఉపాధి తగ్గిపోయిందని నేత కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. రోజంతా కుటుంబం మొత్తం కష్టపడితే రూ.300 మించి కూలీ కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ప్రభుత్వ పథకాలు కొందరికే దక్కుతుండడంతో మిగిలిన కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఈ నేపథ్యంలో నేతన్న నేస్తం పథకాన్ని కూటమి ప్రభుత్వం త్వరితగతిన అమలు చేసి పూర్తి స్థాయిలో కార్మికులకు అండదేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

హామీలు అమలెప్పుడు..?

ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వ నేతలు నేతన్న కుటుంబాలకు వరాల జల్లులు కురిపించారు. అనేక హామీలు ఇచ్చారు. వారి కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పుకొచ్చారు. యువగళం పాదయాత్ర సందర్భంగా పిఠాపురం నియోజకవర్గానికి వచ్చిన నారా లోకేష్ చేనేత కుటుంబాలకి తమ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన వెంటనే చేయూతనందిస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. వారాహి యాత్ర సందర్భంగా పవన్ కళ్యాణ్ గొల్లప్రోలు మండలం చేబ్రోలులో చేనేత కుటుంబాలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేనేతను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అధికారం లోకి వచ్చి 7 నెలలు గడుస్తున్నప్పటికీ గత ప్రభుత్వ అమలు చేసిన నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నేతన్న కుటుంబాల పరంగా ప్రభుత్వం ఒక్క నిర్ణయాన్ని కూడా తీసుకున్న పరిస్థితి లేదు. ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని చేనేత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ సాయం లేక, నమ్ముకున్న చేనేత వృత్తి వదలలేక, వచ్చే నష్టాలను భరించలేక.. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని ఆయా కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సంక్షేమ పథకాలను అమలు చేయాలని నేత కార్మికులు కోరుతున్నారు.

సాయం అందించాలి

గత సర్కారు నేతన్న నేస్తం పేరుతో సాయం అందించేది. ఆ మొత్తాన్ని ముడి సరుకు ఇతర అవసరాలకు వాడుకునేందుకు ఉపయోగ పడదేంది. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం కూడా సాయం అందిస్తానని చెప్పింది. కాని నేటికీ ఒక్క రూపాయి కూడా సాయం అందలేదు. వెంటనే సాయం అందించి నేతన్నలను ఆదుకోవాలి. హామీలను అమలు చేయాలి.

- ఎస్. నారాయణరావు, యు.కొత్తపల్లి

జిల్లా ప్రజలకు కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజలకు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ 2025 నూతన సంవత్సర శుభా కాంక్షలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సంవ త్సరానికి వీడ్కోలు పలుకుతూ 2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా లో 2024 సంవత్సరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్ర మాలు పటిష్టంగా అమలుపరిచి జిల్లాను అన్ని రంగాల లో అభ్యుదయ, ప్రగతి పథంలో పయనింప చేశామ న్నారు. భవిష్య త్తులో కూడా ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు మరింత పటిష్టంగా అమ లు పరుస్తూ పథక ఆశ యాలతోపాటు లక్షిత వర్గాలకు సంక్షేమ ఫలాలు సకాలంలో అందించే దిశగా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు ఎప్పటి కప్పుడు తీసుకుం టాం దన్నారు. కొత్త ఏడాదిలో జిల్లా అన్ని రంగాలలో మరిం తగా సర్వతో ముఖాభివృద్ధి సాధించే లా నూతన ఒరవడితో నిర్మా ణాత్మక అభివృద్ధికి చేసే ఆలోచనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు. నూతన సంవత్స రంలో జిల్లా వాసుల ందరూ సిరి సంపదలు, ఆయురారోగ్యాలతో ఆరోగ్యవంత మైన జీవనాన్ని గడపాలన్నారు. కొత్త ఆశలు, ఆశయాలతో ముందుకు సాగాలన్నారు.మీ జీవితంలోకి సంతో షాలు, విజయాలు తీసుకు రావాలని తల పెట్టే ప్రతి పని విజయ వంతమై మరుపురాని జ్ఞాపకాలను అందించాలని, మీ కలలు నిజమయ్యే సంవత్సరం కావాలని కోరుకుంటున్నానని అన్నారు .


కలెక్టర్ మహేష్‌కుమార్

మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి - అమలాపురం

పట్టణంలో స్థానిక జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్, కొంకాపల్లి నందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.ఘన సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం మండలస్థాయి సైన్స్ విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అయితా బత్తుల ఆనందరావు శాసనసభ్యులు అమలాపురం మాట్లాడుతూ సైన్సును ఆచరణాత్మకంగా చేసి మానవ జీవితానికి ఉపయోగించుకునే సాధనంగా మాత్రమే చూస్తున్నామన్నారు. కానీ ఈ ఆధునిక ప్రపంచంతో మనం పోటీ పడడానికి, మూఢనమ్మకాలు వదులుకుని విజ్ఞానంతో బతకడానికి సైన్స్ కావాలి అని, భక్తిని నమ్మాలి- సైన్స్ ను పాటించాలి అని పిలుపునిచ్చారు. అదేవిధంగా డిఇఒ సలీం బాషా మాట్లాడుతూ ఈ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థులు సైన్స్ ఈ సమాజానికి ఎలా ఉపయోగపడుతుందో అర్థం చేసుకోవడానికి సమాజానికి ఏవి ఉపయోగపడతాయన్నారు. ఏవి హానికరమైనవి అర్థం చేసుకోవడానికి భవిష్యత్తు తరాల కోసం ఏ విధమైన పరిశోధన జరగాలో అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయని వివరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఆనందరావు

ఇదే వేదికపై కౌశల్ క్విజ్ లో రాష్ట్ర స్థాయి తృతీయ బహుమతి సాధించిన స్థానిక పాఠశాల చిన్నారి కుమారి హాసినిని గైడ్ టీచర్ పివిఎల్ఎన్.శ్రీరామ్‌ను వక్తలందరూ అభినందించారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ రాజు, కుడుపూడి భాగ్యలక్ష్మి బాబు, జడ్‌పిటిసి సభ్యుడు పందిరి శ్రీహరి రామ గోపాల్, మున్సిపల్ చైర్మన్ రెడ్డి నాగేంద్రమణి, వానపల్లి ముక్కోటి రాంబాబు, టి.సత్యలక్ష్మి, ఏడిద శ్రీనివాసరావు, గుబ్బల సూర్య ప్రకాశం, బివివి.సుబ్రహ్మణ్యం, కె.భీమారావు, సుబ్రహ్మణ్యం, ఎంవివి.సత్యనారాయణ, రమేష్ బాబు, దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎంల భద్రతకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - అమలాపురం

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఇవిఎంలు), వివిప్యాట్ గొడౌన్‌నకు పటిష్ట భద్రతకు చర్యలు చేపట్టాలని ఇన్‌ఛార్జి డిఆర్ఒ కె.మాధవి సంబంధిత అధికారులను ఆదేశిం చారు. మంగళవారం స్థానిక ఎయిమ్స్ కళాశాల మూడో అంతస్తు నందు భద్రపరిచిన ఇవిఎంలు, వివిప్యాట్ల పటిష్ట భద్రతకు సంబంధించిన చేపడు తున్న ఏర్పాట్లను రెవెన్యూ ఎన్నికలు అగ్నిమా పక అధికారులతో కలిసి తనిఖీ చేశారు.ఇవిఎంల రక్షణ,భద్రతకు సంబంధిం చి చేపడుతున్న ఏర్పాట్ల ను తనిఖీ నిర్వహించే అధికారుల ద్వారా భద్రతా చర్యల వివరా లను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవి మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రాజకీయ ప్రతినిధుల సమక్షంలో ఇవిఎంలు వివిప్యాట్ల గోదాములను భారత్ ఎన్నికల సంఘం ఆదే శాల ప్రకారం నిర్వహిం చడం జరుగుతోందన్నా రు దీనిలో భాగంగానే ఈ తనిఖీని రాజకీయ ప్రతినిధుల సమక్షం లో నిర్వహించామని అన్నారు. దీనిపై సమగ్ర నివేదికను కూడా ఎన్ని కల సంఘానికి నివేదిం చడం జరుగుతుంద న్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలా ఇవిఎం, వివి ప్యాట్ గోదామును తనిఖీ చేసి, సమగ్ర వివరాలతో నివేదికను పంపిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లల వివి ప్యాట్ల గోదాముకు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు పేర్కొ న్నారు. నిరంతరం నిఘా ఉంచా లని సిసి కెమెరాల దృశ్యాలను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్ని కల విభాగం సూపరింటెండెంట్ ఎస్.మురళీకృష్ణ, విద్యా వసతుల కల్పన డివిజనల్ ఇంజినీర్ ఎస్. సుబ్బరాజు, స్థానిక తహశీల్దార్ సుబ్బలక్ష్మి, ఉప తహశీల్దార్ శివరాజ్ రామ్మోహనరావు, ఇండి యన్ నేషనల్ కాంగ్రెస్ (కాంగ్రెస్) తరపున వడ్డీ నాగేశ్వరరావు, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాశక్తి' క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాజోలు

ప్రజా సమస్యలపై నిక్కచ్చిగా వార్తలు రాస్తూ ప్రజల మన్ననలు పొందుతున ప్రజాశక్తి దినపత్రిక 2025 క్యాలెండర్‌ను మంగళవారం రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ ఆవిష్కరించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదంతో'ప్రజాశక్తి' విజయవంతంగా ప్రజల గొంతుకును వినిపిస్తోందన్నారు. 'ప్రజాశక్తి ' విలువలతో కూడిన వార్తలతో సమాజానికి దిశా నిర్దేశం చేస్తుందన్నారు. ప్రజాశక్తి క్యాలెండర్లో వేస్తున్న సీనరీలు, డిజైన్లు చాలా చక్కగా ఉంటాయని ప్రశంసిం చారు. ఈ కార్యక్రమంలో ఎపి మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, బుంగ అల్బర్ట్ రాజు, కలిగితి రాజు, విలేకరి పీతల రాజశేఖర్ పలువురు పాల్గొన్నారు


ఆవిష్కరిస్తున్న రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్

పలువురు ఉద్యోగ విరమణ


ఆలమూరులో హెడ్ కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎక్సైజ్ సిఐ నాగేశ్వరరావు, తదితరులు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో వివిధ శాఖలకు చెందిన అధికారులు ఉద్యోగ విరమణ చేశారు. వివరాలు ఇవి..

ఆలమూరు: స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాజేం ద్రప్రసాద్ సేవలు ఎనలేనివని ఎక్సైజ్ సిఐ ఐడి.నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రం లోనిఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో హెడ్ కానిస్టేబుల్ అరసాల రాజేంద్రప్రసాద్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని సిఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహి ంచారు. డిసెంబర్ 31న హెడ్ కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్రప్రసాద్ అంకితభావంతో పనిచేస్తూ పలువురు మెప్పు పొందారన్నారు. ఉద్యోగులకు ఎన్ని రోజులు పనిచేసిన ఉద్యోగ విరమణ తప్పదని ఆయన పేర్కొన్నారు. అనంతరం రాజేంద్రప్రసాద్ దంపతులను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ పి.రాంబాబు, హెడ్ కానిస్టేబుళ్లు గెడ్డం శ్రీనివాసరావు, సప్తగిరి, కానిస్టేబుళ్లు జయ కిషోర్‌సింగ్, క్రాంతి కుమార్, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, చిట్టి తల్లి, యూనియన్ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.**ముమ్మిడివరం:** విద్యా శాఖలో సుదీర్ఘ కాలం పాటు మండల విద్యాశాఖాధికారిగా పని చేసిన రమణ శ్రీ నిబద్ధతకు మారు పేరుగా నిలిచారని పలువురు కొనియాడారు. మండల విద్యా శాఖాధికారిగా సుదీర్ఘ కాలం పాటు బాధ్యతలు నిర్వహించిన బొజ్జా రమణ శ్రీ మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. స్థానిక మండల వనరుల కేంద్రం లో ఎంఇఒ-2 ఆర్.ఉదయ్ భాస్కర్ అధ్యక్షతన రమణ శ్రీ దంపతుల సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమంలో మండలంలోని ప్రాథమిక, ప్రాదమికొన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు రమణ శ్రీ సేవలను కొనియాడుతూ దంపతులకు దుశాలువా కప్పి ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు అందించిన సేవలు వెలకట్టలేనివని ప్రశంసిశించారు. ఈ కార్యక్రమం లో ఎంపిడిఒ వెంకటాచార్య, ఇఒపిఆర్‌డి లక్ష్మి కళ్యాణి, పర్యవేక్షణ అధికారి ఎఎన్. శ్రీనివాస్ సిఆర్‌పి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ముమ్మిడివరంలో రమణీశ్రీ దంపతులకు సత్కారం

జిల్లా స్థాయి 10కె రన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - రామచంద్రపురం

జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి 10కె రన్ క్రీడా పోటీలను ఎంపిపి అంబటి భవాని, మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి మంగళవారం ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర ధారుడ్యానికి ఉపయోగపడతాయన్నారు. క్రీడాకారులకు జాతీయస్థాయిలోనూ గుర్తింపు ఉంటుందని అన్నారు. అనంతరం కంట్రీ రన్-10 కి.మీ, 8 కి.మీ, 6 కి.మీ, 2 కిలోమీటర్లు ప్రారంభించారు. పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులు జనవరి 5న పశ్చిమగోదావరి జిల్లా తణుకులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్ సెక్రటరీ రవితేజ, అథ్లెటిక్ కోచ్ ప్రసాద్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అప్పన్న, కోఆర్డినేటర్ సురేష్ తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్ సత్యనారాయణ, ఎవివి.సత్యనారాయణ, జగదీష్ .యోగ మాస్టర్ అబ్బు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.


టెన్ కె రన్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపిపి భవాని

యుటిఎఫ్ సిఎల్ పుస్తకాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

యుటిఎఫ్ సిఎల్ పుస్తకాలను మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు మంగళవారం ఆత్రేయపురం తన స్వగృహంలో ఆవిష్కరించారు. వీటిని ఉపాధ్యాయులు, శ్యామ్ జాదూగర్ చింత శ్యామ్ తనయుడు ఫిజియోథెరపిస్ట్ చింతా మోహిత్ ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేశారు. సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ యుటిఎఫ్ సేవలు అద్వితీయమని కొనియాడారు. అనంతరం చింతా శ్యామ్ చేస్తున్న సేవలు సమాజానికి ఆదర్శప్రాయమైనవని, ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం శ్యామ్ కుటుంబం ఎల్లవేళలా అందిస్తుందని కొనియాడారు. హాస్పిటల్ పెట్టిన అనతికాలంలోనే వారి కుమారుడు ప్రతిభ కనబరుస్తున్నారని అన్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయిలో సుమారు రూ.20 వేలతో నాలుగు మండలాల యుటిఎఫ్ శాఖలకు ఉపాధ్యాయులకు అవసరమైన సిఎల్ పుస్తకాల ముద్రణకు సహకరించిన డాక్టర్ చింత శ్యామ కుమార్ మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ముదునూరి వెంకటరాజు దుశ్శా లువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆత్రేయపురం మండల యుటిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.


బైపాస్ రోడ్డులో కారు వ్యాన్ ఢీ

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

కామనగరువు ఆమని ఆటోమొబైల్స్ సమీపంలోని బైపాస్ రోడ్డులో కారు, ఐషర్ వ్యాన్ ఢీకొన్నాయి. ఈ సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కారు యజమాని తన పిల్లలతో కలిసి అమలాపురం మండలం జనుపల్లి గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చారు.తిరిగి కాకినాడ వైపునకు వెళ్లేందుకు విత్తనాలవారి పాలెం నుంచి వస్తూ బైపాస్ రోడ్డు ఎక్కుతుండగా ఇంతలో బైపాస్ రోడ్డు మీద నుండి ఎదురుగా వేగంగా వస్తున్న ఐషర్ వ్యాన్ ఢీ కొట్టింది. దాంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఒక్కసారిగా ప్రమాదం జరగడంతో కారులోని బెలూన్స్ ఓపెన్ అయ్యాయి. దాంతో కారులో ఉన్న ఇద్దరు పిల్లలు, కారు నడుపుతున్న వ్యక్తి క్షేమంగా బయటపడ్డార ని తెలిపారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

కార్టూ'నిజం'



ముందుగానే పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - కొత్తపేట

నూతన సంవత్సరానికి ముందుగానే పింఛన్లను పంపిణీ చేశామని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. వాడపాలెం, కొత్తపేట, పలివెల గ్రామాల్లో నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన సంవత్సరానికి ముందుగానే పించన్ల పండుగ వచ్చిందన్నారు. భర్త చనిపోయిన వెంటనే భార్యకు ఏ నెలకు ఆ నెలే పింఛను మంజూరు చేయాలనే స్పౌజ్ కేటగిరీ విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింద న్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో 49 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు..ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **ఆత్రేయపురం**: పింఛన్ పొందడానికి అర్హత ఉండి దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి పింఛన్లు అందజేస్తామని ఎంపిడిఒ బికెఎస్-ఎస్.వెంకట్ రామన్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని గ్రామాలలో పంపిణీ చేసిన ఎన్‌టిఆర్ భరోసా పింఛను కార్యక్రమాన్ని ప్రక్రియను పరిశీలించారు.

తహశీల్దార్ కిశోర్ బాబుకు సన్మానం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్


రెవెన్యూ శాఖలో 38 సంవత్సరాలుగా సేవలందించిన అమలాపురం తహశీల్దార్ జిడి.కిశోర్‌బాబు ను బండారులంక సర్పంచ్ పెనుమాల సునీత ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అమలాపురం తహశీల్దార్ కిశోర్ బాబు ఉద్యోగ విరమణ సందర్భంగా గత నెల 30న స్థానిక సత్యనారాయణ గార్డెన్స్ లో రెవెన్యూ ఉద్యోగులు ఏర్పాటుచేసిన సన్మాన సభలో ఆమె పాల్గొన్నారు. రాష్ట్ర జెఎసి ఛైర్మన్ ఎస్.దివాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లు, రెవెన్యూ ఉద్యోగులు, దళిత నాయకులు జంగా బాబురావు, నాయకులు పెనుమాల ఏడుకొండలు, కరాటం ప్రవీణ్, చింత శంకర మూర్తి తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగ విరమణ చేసిన తహశీల్దార్ కిశోర్ బాబును సన్మానిస్తున్న పలువురు

డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి - కొత్తపేట

అవిడి డిస్ట్రి బ్యూటరీ ఛైర్మన్ చేవల జగన్నాథంను మంగళవారం ఘనంగా సన్మానించారు. సన్మానసభకు కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానం దరావు హాజరయ్యారు. పలివెల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఛైర్మెన్, సభ్యులకు ఎంఎల్ఎ అభినందనలు తెలిపి శాలువాలతో సత్కరించారు. ఈ సంద ర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ ఛైర్మన్‌గా తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. తద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, సాదే లక్ష్మి, ధరణాల రామకృష్ణ, ముత్యాల బాబ్జి, బూసి జయలక్ష్మి, మల్లవరపు బుజ్జి, నల్ల రమణ, బండారు వీరబాబు, పల్లి యేసు కూటమి నాయకులు పాల్గొన్నారు.


ఛైర్మన్‌ను సత్కరిస్తున్న ఎంఎల్ఎ బండారు

గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని ముమ్మిడివరం మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహంతుల్లా విద్యార్థినులకు సూచించారు. స్థానిక డాక్టర్ ఎంజిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలో మంగళ వారం గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై అవగాహనా సదస్సును నిర్వహించారు. మేజిస్ట్రేట్ రహంతుల్లా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌లపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ర్యాగింగ్, చిల్డ్రన్ మ్యారేజ్ యాక్ట్‌లపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహు మతులు అందించారు. ఈ కార్యక్రమం లో న్యాయవాదులు రెడ్డి సత్య నారాయణమూర్తి, ఎజిపి టి.శాంతి సుధ, ప్యానెల్ అడ్వకేట్ జి.శ్రీనివాస రావు, ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న మేజిస్ట్రేట్

నేరాలు ఘోరాలు



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి టిఎస్ఆర్.ప్రసాద్

చోరీ కేసుల్లో ముగ్గురు అరెస్ట్ సొత్తు స్వాధీనం

ప్రజాశకి - ముమ్మిడివరం

అంతర జిల్లాలలో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి బంగారం, వెండి, మోటార్ సైకిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు అమలాపురం డిఎస్పి టిఎస్ఆర్ కె.ప్రసాద్ తెలిపారు. ముమ్మిడివరం సిఐ కార్యాలయంలో మంగళవారం రాత్రి నిర్వహించిన మీడియా సమావేశంలో డిఎస్పి ప్రసాద్ మాట్లాడుతూ ఐ పోలవరం మండలం వడ్డి చెరువుకు చెందిన ఓలేటి మహాలచ్చారావు, పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం చిన్న మల్లం కు చెందిన గెద్దాడ సురేంద్ర, పశ్చిమగోదావరి జిల్లా తణుకు చెందిన పొట్టు పోతుల ఉదయ్ కుమార్ లు అనుమానాస్పదంగా లక్ష్మీదేవి లంక వద్ద తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించారన్నారు. ముమ్మిడివరం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు, అయినవిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, ఏలూరు జిల్లా చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, మొత్తం ఏడు కేసులకు సంబంధించి నిందితుల నుంచి 277.1 గ్రాముల బంగారం, కేజీ 1.215 గ్రాముల వెండి, రెండు మోటార్ సైకిల్ పల్సర్, సుజుకి యాక్సెస్ , మూడు సెల్ ఫోన్లు మొత్తం విలువ రూ.23 లక్షల 30 వేల సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పి తెలిపారు. నిందితులు వ్యసనాలకు బానిసై ఈజీ మనీకి అలవాటు పడి ఈ దొంగతనాలు పాల్పడుతున్నారని డిఎస్పి వివరించారు. నిందితులను దుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి బంగారు వెండి వస్తువులు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిఎస్పి వివరించారు. చోరీ కేసును అత్యంత చాక చక్యంగా చేదించిన సిఐ ఎం.మోహన్ కుమార్, ఎస్ఐ డి.జ్వాలా సాగర్, సిబ్బందిని ఎస్పి కృష్ణారావు ఈ సందర్భంగా అభినందించారు. ఈ సమావేశంలో ముమ్మిడివరం సిఐ ఎం.మోహన్ కుమార్, ఎస్ఐ డి.జ్వాలా సాగర్ లు పాల్గొన్నారు.

యువకుని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మోటారు బైక్ పై వెళ్తూ ప్రమాద వశాత్తు చెట్టుని ఢీ కొట్టి అవుట్ ఫాల్ స్లూయిజ్‌లో పడి గల్లాంతయిన యువకుడి మృతదేహం గత నెల 30వతేదీ రాత్రి లభ్యమైంది. దీనికి సంబంధించి మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఉప్పలగుప్తం మండలం కామరాజుపేటకు చెందిన పెయ్యల స్టీఫిన్, ధోనిపాటి అభిషేక్(23) యానాం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ సమయంలో ప్రమాద వశాత్తు మురమళ్ల పల్లంకుర్రు ఏటిగట్టు రోడ్డులో చెట్టును ఢీకొన్నారు. ఈ ఘటనలో ప్రమాదవశాత్తూ అయినాపురం అవుట్ ఫాల్ స్లూయిజ్‌లో అభిషేక్ పడి గల్లంతయ్యాడు. అతని ఆచూకీ కోసం పోలీసులు, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టగా గత నెల 30న మృతదేహం లభ్యమయింది. ఈ ప్రమాదంలో మరో యువకుడు స్టీఫెన్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు ఎస్ఐ డి జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మంగళవారం దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అయినాపురం గ్రామానికి చెందిన వివాహిత మట్ట వీరవేణి (30) కుటుంబ కలహాలతో గత నెల 30వ తేదీ రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి భర్త సత్యనారాయణ గౌడ్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు ముమ్మిడివరం సిఐ ఎం.మోహన్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుల సర్వే సక్రమంగా నిర్వహించాలి

సామర్లకోట : ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల సర్వేను సక్రమంగా నిర్వహించాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు వల్లూరి నాని కోరారు. మంగళవారం తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్ రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో మాదిగ కులస్తులను మాలలుగా చూపిస్తూ సర్వేను తప్పుగా నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు లోకేష్, ఎం.రాజు ఎం.వెంకన్న ఎం.రాజ్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.

విఆర్‌ఒల సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - రౌతులపూడి

విఆర్‌ఒల సంఘం మండల నూతన కమిటీ ఎన్నికైంది. సంఘం అధ్యక్షులుగా అనపర్తి నాగేశ్వరరావు, కార్యదర్శిగా పారుపాక విఆర్‌ఒ ప్రసాద్ ఎన్ని కయ్యారు. ఉపాధ్యక్షులుగా సత్యవేణి, కోశాధికారిగా చంటియ్య, ఇతర కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. అభినందించారు.

ఘనంగా యూత్ క్రిస్మస్

ప్రజాశక్తి - యానాం


యానాం యూత్ క్రిస్మస్ వేడుకలు స్థానిక బస్ కాంప్లెక్స్ ఆవరణలోని మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా జరిగింది. యానాం క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో ఈ వేడుకను నిర్వహించారు. ఈ వేడుకల్లో అంతర్జాతీయ సువార్తికులు డాక్టర్ జాన్ వెస్లీ పాల్గొని క్రిస్మస్ సందేశం ఇచ్చారు. అనంతరం క్రిస్మస్ కేకును ప్రతినిధులతో కలిసి కట్ చేశారు. ఇవాంజలిస్ట్ మారెళ్ల స్టీవెన్ పాల్గొన్నారు

అందుబాటులో లేని వైద్యులు

- కానరాని ఫార్మాసిస్ట్
- రోగులకు స్టాఫ్ నర్సే దిక్కు
- పామర్రు ఆరోగ్య కేంద్రంలో పరిస్థితి

ప్రజాశక్తి - రామచంద్రపురం

మంగళవారం ఉదయం 11 గంటలైనా డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో పామర్రు ఆరోగ్య కేంద్రంకు వచ్చే రోగులు ఇక్కట్లకు గురవుతున్నారు. మారుమూల ప్రాంతాల్లో ఉన్న ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కావడం లేదనేది ఈ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తే అర్థమవుతోంది. పామర్రు ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి గా పి.హర్షిత పనిచేస్తున్నారు. ఆమెతో పాటు విష్ణువర్ధన్ మరో వైద్యులుగా పనిచేస్తున్నారు. మంగళవారం విష్ణువర్ధన్ సెలవుపై వెళ్లిపోయారు. వైద్యాధికారి అమజూరు మెడికల్ క్యాంపునకు వెళ్లడంతో ఇక్కడ రోగులకు వైద్య సేవలు అందించే నాధుడే లేకుండా పోయాడు. దీంతోపాటుగా ఫార్మసిస్ట్ గది ఖాళీగా ఉంది ఇక్కడ ఫార్మాసిస్టుగా పనిచేస్తున్న దేవి మందులు తీసుకురావడానికి వెళ్లగా మందులు ఇచ్చే పరిస్థితి కానరావడం లేదు. ఇక మధ్యాహ్నం 12 గంటలకు స్టాఫ్ నర్స్ ఎలిజబెత్ వచ్చి వచ్చిన రోగులను పరీక్షించి ఆమె వద్ద ఉన్న మందులను అందజేశారు. 24 గంటలు పనిచేసే ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది దూర ప్రాంతాల్లో ఉండటం వైద్యులు కాకినాడ నుంచి అంగర నుంచి రావడం తో తీవ్ర జాప్యం జరుగుతుందని ఇక్కడికి వస్తున్న రోగులు తెలియజేస్తున్నారు. ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు సిబ్బంది సక్రమంగా వీధులు నిర్వర్తించే విధంగా చర్యలు చేపట్టాలని, 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండేలాగా చర్యలు తీసుకోవాలని పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



పామర్రు ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేక వెలవెలపోతున్న గదులు



రోగులను పరీక్షిస్తున్న స్టాఫ్ నర్స్

ఉదయం నుండి వేచి చూస్తున్నా



పామర్రు సమీప గ్రామమైన ఆముజూరు నుంచి వచ్చాను. ఉదయం నుంచి వైద్యుల కోసం వేచి చూస్తున్నాను. ఎప్పుడు వచ్చినా వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. అదేవిధంగా సుధీర్ ప్రాంతాల నుంచి వైద్యులు రావడం వల్ల తీవ్ర జాప్యం జరుగుతోంది. ఎవరూ లేకపోవడంతో స్టాఫ్ నర్స్ తో చూపించుకుని వెళుతున్నాను. మారుమూల ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని ఎక్కడ పరిస్థితి చూస్తే అర్థమవుతోంది.

-గుత్తిన నరసింహమూర్తి



ఫార్మాసిస్టు లేకపోవడంతో ఖాళీగా ఉన్న మందుల గది

ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హర్షిత వివరణ

పామర్రు ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంపై వైద్యాధికారి పి.హర్షితను 'ప్రజాశక్తి' వివరణ కోరగా ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉన్నారని అన్నారు. అందులో ఒకరు అత్యవసర సెలవులు వెళ్లారని తెలిపారు. తాను అముజూరులో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపునకు వెళ్లడంతో ఆరోగ్య కేంద్రంలో ఎవరూ లేరని తెలిపారు. ఏదైనా అత్యవసర కేసు ఉంటే వెంటనే వెళతానని తెలిపారు.



వాలీబాల్ టోర్నమెంట్ సమావేశంలో మాట్లాడుతున్న దేశంశెట్టి

శివరాత్రికి గొల్లవిల్లిలో జాతీయ వాలీబాల్ టోర్నీ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గొల్లవిల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో క్రీడా ప్రాంగణంలో గతంలో నిర్వహించినట్టుగానే శివరాత్రి సందర్భంగా జాతీయస్థాయి డే అండ్ నైట్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు టోర్నీ అధ్యక్షులు మాజీ జడ్‌పిటిసి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ తెలిపారు. గొల్లవిల్లిలో మంగళవారం జాతీయస్థాయి వాలీబాల్ టోర్నీ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఫిబ్రవరి 26, 27, 28 మార్చి 1 తేదీల్లో నాలుగు రోజులపాటు టోర్నమెంట్ నిర్వహించేందుకు తీర్మానించారు. టోర్నమెంట్ కు అరిగెల శ్రీ రంగయ్య (ఎఎస్ఆర్) మెమోరియల్ జాతీయస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ గా నామకరణం చేశారు. అధ్యక్షునిగా దేశం శెట్టి లక్ష్మీనారాయణ, గౌరవాధ్యక్షులుగా ఎంఎల్‌ఎ అయితాబత్తుల ఆనందరావు, సాంకేతిక సలహాదారునిగా ఉండ్రు సుబ్బారావు (రాజబాబు), ప్రధాన కార్యదర్శిగా అరిగెల నానాజీ కార్యనిర్వాహక కార్యదర్శిగా పీడీ, గొలకోటి ఫణీంద్ర కుమార్, ఉపాధ్యక్షులుగా మద్దింశెట్టి సురేష్, సలాది నాగరాజు సంయుక్త కార్యదర్శిగా గుత్తుల శ్రీనివాస్ (డాక్టర్ శ్రీను), గుత్తాల సుభాష్ చంద్రరావు(బోసు)లను నియమించారు. అలాగే కమిటీ సభ్యులుగా నల్లా వెంకటేశ్వరరావు (బాబండి), చీకట్ల ఏసుబాబు, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, సలాది సత్తిబాబు, ఆకేటి శ్రీనివాస్, అడబాల సత్యనారాయణ ఆకుల బుజ్జి, మారిశెట్టి నాని, చిక్కం ఉమేష్, గుర్రాల దుర్గారావు, కడలి శ్రీనివాసరావు, గొలకోటి శ్రీనివాసరావు లను నియమించారు.



విద్యార్థులను అభినందిస్తున్న విద్యాశాఖాధికారులు, సర్పంచ్ తదితరులు

'వివేకానంద' స్కూల్ విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - రాజోలు

రాష్ట్రపతి భవన్‌లో గత నెల 24న నిర్వహించిన యువ మార్పు తయారీ దారుల సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు పలువురు మంగళవారం అభినందనలు తెలిపారు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం గ్రామంలోని వివేకానంద స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థినిలు పెసల భువన సాధిక, నల్లి రోజిలిన్ ల ప్రాజెక్ట్ రాష్ట్ర పతి భవన్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ సమక్షంలో గత నెల 24న యువ మార్పు తయారీ దారుల సదస్సులో ప్రదర్శించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరాయపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంఇఒ విజయశ్రీ , విద్యాశాఖాధికారి వైవి.సత్యనారాయణ, విశ్వేశ్వరాయపురం గ్రామ సర్పంచ్ హెలీనా విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ను ఈ రకంగా ప్రోత్సహిస్తున్న స్కూల్ ప్రిన్సిపల్ పివివి. వర ప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో 1ఎం1బి ఏరియా మేనేజర్ కె.సాగర్ పాల్గొని గ్రామీణ ప్రాంతాల్లో యువతలో నైపుణ్యాలను అభివద్ధి చేయుటకు, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా 1ఎం1బి పనిచేస్తోందన్నారు. దీనిలో భాగంగా నిర్వహించిన ప్రాజెక్ట్ ఎంపిక కార్యక్రమంలో జాతీయ స్థాయిలో9 ప్రాజెక్టులకు 15 మంది విద్యార్థులు పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక పాఠశాల వివేకానంద అని తెలిపి విద్యార్థుల కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అడ్వైజర్ రమేష్‌బాబు, సంగీతరావు, సామాజిక కార్యకర్త బోనంరాజు, రత్నరాజు,నల్లి శామ్యూల్ రాజు,పాల్గొన్నారు.

చేసిన సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఉద్యోగి తన విధి నిర్వహణలో చేసిన సేవలు తగిన గుర్తింపునిస్తాయని అమలాపురం డిఎస్‌పి టిఎస్ఆర్‌కె.ప్రసాద్ అన్నారు. ఉప్పలగుప్తం పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐ గా విధులను నిర్వర్తిస్తూ మంగళవారం ఉద్యోగ విరమణ చేసిన యల్లమిల్లి సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. గొల్లవిల్లి నిమ్మకాయల చినరాజప్ప కళ్యాణ మండపంలో స్థానిక ఎస్ఐ సిహెచ్.రాజేష్ అధ్యక్షతన ఉద్యోగ విరమణ సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన ఎఎస్ఐ సత్యనారాయణ ఉమాదేవి దంపతులకు డిఎస్‌పి ప్రసాద్, సిఐలు డి.ప్రశాంత్ కుమార్, వీరబాబు, ఎస్ఐలు కిషోర్ బాబు, శేఖర్ బాబు, నూకల నాగేశ్వరరావు, ఎఎస్ఐ లు పోలీసు సిబ్బంది రాజకీయ నాయకులు దుశ్శాలువాలు కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. సత్యనారాయణ పోలీసు విధుల్లో ఉన్నతాధికారుల మన్ననలు పొంది తన విధి నిర్వహణను సక్రమంగా నిర్వహించారని కొనియాడారు.



ఉద్యోగ విరమణ చేసిన సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న డిఎస్‌పి ప్రసాద్, పోలీసులు

కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు

ప్రజాశక్తి - ఆలమూరు

సీనియర్ న్యాయవాది శేషాద్రి పట్ల అనంతపురం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ అమానుషంగా వ్యవహరించి అతని మృతికి కారణం అవ్వడంతో సిఐ చర్యను ఖండిస్తూ మంగళవారం బార్ అసోసియేషన్ అధ్యక్షులు జొన్నపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలమూరులో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. పోలీసు ఉన్నతాధికారులు అనంతపురం త్రీ టౌన్ సిఐ చర్యలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ చల్లా సతీష్, జాయింట్ సెక్రటరీ రాజశేఖర్, కప్పల సునీల్ కుమార్, సలాది సత్యనారాయణమూర్తి, ఏజీపీ బూసి విద్యా ప్రసన్న, సవాకుల సత్యనారాయణ, బాపిరాజు, కపావరం, అబ్బులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతు ముంగిట రెవెన్యూ సేవలు

ప్రజాశక్తి -మామిడికుదురు

రైతు ముంగిట భూసమస్యలు పరిష్కరించాలనే లక్ష్యముతో ప్రభుత్వము ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ వైవి.సుబ్రహ్మణ్య చారి అన్నారు పాశర్లపూడిలంక లో మంగళవారం సర్పంచ్ తెలగా రెడ్డి సూర్యప్రకాశరావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది మ్యూటేషన్ల్ తో, రెవెన్యూ పరమైన ఇతర సమస్యలను సదస్సులో పరిష్కరించుకోవాలని అన్నారు. ముందుగా గ్రామం లో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు చెరుకూరి పార్వతి, సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రిడిటియేషన్ కార్డుల గడువు పొడిగింపు

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ప్రస్తుతం డిసెంబర్ 31, 2024 నాటికి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేస్తున్న పాత్రికేయులకు మాత్రమే జనవరి 1, 2025 నుంచి ఫిబ్రవరి 28, 2025 వరకు పొడిగింపు సౌకర్యం కొనసాగుతుందని కలెక్టర్ మహేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని రెండు నెలలు పాటు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గాని జరుగుతుందన్నారు. ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు జారీచేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా మంగళవారం ఆదేశాలు జారీ చేశారనీ కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు.



కేదార్లంకలో ఉద్యాన పరిశోధన పై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తెల్ల దోమ నివారణపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని కేదార్లంక లో మంగళవారం తెల్ల దోమ నివారణ పై రైతులకు అవగాహన కల్పించారు .ఈ సందర్భంగా వైఎస్ఆర్ ఉద్యాన వన యూనివర్సిటీ వెంకట్రామన్నగూడెంకు చెందిన విద్యార్థులు రైతులకు ఉద్యాన కృషి అనుభవ కార్యక్రమంలో అంబాజీ పేట పరిశోధన కేంద్రానికి చెందిన పలువురు శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.. కొబ్బరి లో తెల్ల దోమ నివారణకు తీసుకోవాలిసిన జాగ్రత్తలు, జీవామతం తయారీ, సేంద్రియ పద్దతి లో విత్తన శుద్ధి చేసే విధానాలను రైతులకు వివరించారు.. కొబ్బరి లో తెల్లదొమ నివారణకు జిగురు అట్టలు అలా అతికించలో రైతులకు చేసి చూపించారు..ఏయే రకాల పురుగులకు ఏమేమి మందులు వాడాలో సూచించారు. జీవామతం తో విత్తన శుద్ధి చేస్తే తెగుళ్ల నివారణ తో పాటు మొలక శాతం పెరిగి తక్కువ ఖర్చు తో ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. ఉద్యాన పంటలు పండించడం వల్ల వచ్చే లాభాలు, పండించే విధానాలను రైతులకు వివరించారు. ఉద్యాన వన శాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల పై రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విద్యార్థులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఫిజియోథెరపీపై అవగాహనలో నిజాం బృందం

ఫిజియోథెరపీపై ఉద్యోగులకు అవగాహన

ప్రజాశక్తి - ఆలమూరు

ఫిజియోథెరపీపై ఉద్యోగులకు పూర్తి అవగాహనఉండాలని హైదరాబాద్ నిజాం ఆసుపత్రి ఫిజియోథెరపీ వైద్య నిపుణులు డాక్టర్లు సంతోష్ కుమార్ తదితరులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎ.రాజు అధ్యక్షతన మంగళవారం ఫిజియోథెరపీపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మొబైల్ వాడకం ఒక వ్యసనంలా తయారైందన్నారు. ప్రతి ఒక్కరూ వీలైనంతవరకు మొబైల్ కు దూరంగా ఉండాలన్నారు. అలాగే వివిధ రకాల శరీర అవయవాల నొప్పులు నివారణకు, సయాటికాలో ఎల్ 1, ఎల్ 2 స్టేజ్ లు వంటి వ్యాధుల నివారణకు ముఖ్య కారణాలు వైద్యులు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. మనకు తెలియకుండా ఇటువంటి వ్యాధుల బారిన పడుతున్నామన్నారు. దీనికంతటికి తగినంత శ్రద్ధ లేకపోవడమే కారణమని వారు వివరించారు. చిన్న చిన్న వ్యాయామాలతో వాటిని అరికట్టవచ్చని వైద్య బందం తెలిపింది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ మెహర్ ప్రకాష్, జూనియర్ అసిస్టెంట్ సతీష్ మోహన్, కార్యదర్శులు సాయి ప్రసాద్, వేణి, వీరమాత, వెంకటరత్నం, సుభాష్, తదితర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నారాయణమూర్తి పుట్టిన రోజు

రౌతులపూడి : సినీహీరో, దర్శక నిర్మాత ఆర్.నారాయణమూర్తి పుట్టిన రోజు వేడుకలను జన్మదిన వేడుకలను మంగళవారం బుల్లిఅబ్బాయి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. మార్కెట్ సెంటర్‌లో ఆంజనేయస్వామి గుడి వద్ద సూర్ల శ్రీను తదితరులు నారాయణమూర్తి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా రౌతులపూడి మండలవ్యాప్తంగా ఆయన చేపట్టిన సేవా కార్యక్రమాలను కొనియాడారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

దేవాంగ విద్యార్థిని, విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం మంగళవారం బండారులంక ఉమారామలింగ చౌడేశ్వరీ దేవస్థానం, వూటుకూరి వీరబ్రహ్మం, పార్వతి దేవాంగ కళ్యాణ మండపంలో సంఘ అధ్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అధ్యక్షతన జరిగింది. సాంకేతిక విద్యనభ్యసించుచున్న సుమారు 190 మంది దేవాంగ విద్యార్థిని, విద్యార్థులకు రూ.3.60 లక్షల నగదును ఉపకారవేతనంగా పెద్దల సమక్షంలో పంపిణీ చేశారు. అనంతరం త్వరలో నిర్వహించబోయే సంఘ స్వర్ణోత్సవ వేడుకల నిర్వాహణ గురించి వివిధ గ్రామ సంఘ పెద్దలతో చర్చించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి పుత్సల వరదరాజు, చింతా వీరభద్రేశ్వర రావు, గుంటూ పాండురంగ, దైవపు నందయ్య, కటకం ధనలక్ష్మీశ్వరరావు, పిచ్చిక పొలిశెట్టి, బళ్ల వెంకటేశ్వర రావు, చింతపట్ల గంగా సత్యన్నారాయణ, మాడా రాము, ఎక్కల మెహర్,జాన గణేష్,అంకం మల్లేశ్వర రావు, కారుపర్తి సాయి విద్యార్థుల తలిదండ్రులు పాల్గొన్నారు.



బండారులంకలో విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న వూటుకూరి

ఫొటోగ్రాఫర్స్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

లూయిస్ ఫొటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను తహశీల్దార్ విఎస్.దివాకర్ ఆవిష్కరించారు.స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షులు దేవరపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్యాలెండర్ లను ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి జానా శంకర్(శేట్), ఫొటో వీడియో గ్రాఫర్ లు బొక్కా పుల్లంశెట్టి, జంగా రవికుమార్, ఆదినారాయణ, రాజేష్ కుమార్, అంబటి వెంకటేశ్వరరావు, సూదా వెంకటరత్నం, పోలినాటి భీమేశ్వరరావు, దోనిపాటి రాంబాబు, సలాది శివాజీ, శివ, నాగరాజు,నాని, ఎం,వెంకటేశ్వరరావు, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



ఫొటోగ్రాఫర్స్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహశీల్దార్ దివాకర్

నత్తనడకన దాళ్వా సాగు

ప్రజాశక్తి - కె.గంగవరం

దాళ్వా పంట సాగు డిసెంబర్ నెలలో నాట్లు పూర్తి చేయాలని ఈ వ్యవసాయ శాఖ సూచించినప్పటికీ అది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. రైతులు నత్తనడకగా సాగు కొనసాగిస్తున్నారు. కె.గంగవరం మండలంలో 15 వేల 600 ఎకరాలు వరిసాగు అవుతోంది. డిసెంబరు నెలాఖరుకు 70 శాతం మాత్రమే రైతులు వెదచల్లడం పూర్తి చేశారు. పాణింగపల్లి, కోటిపల్లి, మసకపల్లి, పరిసర ప్రాంతాల్లో ఇంకా పలుచోట్ల దమ్ములు కూడా పూర్తి కాకపోవడంతో దాల్వాపంట మరింత ఆలస్యమైతుంది. దీనిపై మండల వ్యవసాయ శాఖ అధికారి బలుసు రవి మాట్లాడుతూ ఇప్పటివరకు 70 శాతం రైతులు నాట్లు పూర్తి చేశారని మిగిలినవారు త్వరగా నాట్లు పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా అధిక శాతం రైతులు బోండాలు రకం వరి సాగు చేస్తున్నారని ఆయన వివరించారు. దాల్వ పంట త్వరగా పూర్తిచేస్తే అపరాలు పంట పండించే అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ప్రజాశక్తికి తెలిపారు.



పాణింగపల్లిలో దమ్ములు చేయని పంట భూములు